

పశువుల శరీర భాగాల అక్రమ రవాణా

బొండపల్లి, ఫిబ్రవరి 18: ఒడిశా నుంచి విజయనగరానికి అక్రమంగా సుమారు 70 పశువులకు చెందిన శరీర భాగాలు, ఎముకలను ఓ వ్యాన్‌లో ఆదివారం తరలిస్తుండగా పోలీసులు అడ్డున్నారు. వ్యాన్ జాతీయ రహదారి మీదుగా వస్తుండగా తీవ్ర దుర్వాసన రావడంతో పోలీసులకు అనుమానం వచ్చి వాహనాన్ని పరిశీలించారు. పశువుల శరీర భాగాలు, ఎముకలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు సమీపంలోని రాజా చెరువులో గొయ్యితవ్వి పూడ్చిపెట్టారు. వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

హామీ ఏమైంది జగనన్నా..

- 'జంఝావతి'పై ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఐదేళ్లుగా పట్టించుకోని వైనం
- కీలక పనులు పెండింగ్
- ఒడిశాతో నెలకొన్న జల వివాదం
- రైతన్నలకు తప్పని సాగునీటి కష్టాలు





(పార్వతీపురం ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని జంఝావతి ప్రాజెక్టును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. తాము అధికారంలోకి వస్తే ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని గత ఎన్నికల సమయంలో సీఎం జగన్ హామీ ఇచ్చారు. అయితే అధికారం చేపట్టి ఐదేళ్లవుతున్నా కనీసం పట్టించుకొనే దాఖలాలు లేవు. ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డంకిగా నిలిచిన సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చిన ముఖ్యమంత్రి వాటిపై దృష్టి పెట్టడం లేదు. జంఝావతి ప్రధాన మట్టికట్టు, స్పిల్‌వే, రెగ్యులేటర్ వంటి కీలక నిర్మాణాలు గతంలోనే పూర్తయ్యాయి. అయితే జలాశయంలో నీటి నిల్వకుగాను నదీ ప్రవాహాన్ని మళ్లించే 'రివర్ గ్యాప్' పనులకు మాత్రం ఒడిశా అభ్యంతరం చెబుతూ వస్తోంది. ఈ పనులు జరిగితే జంఝావతి నది ఎగువ ప్రాంతమైన ఒడిశాలోని బందుగాం బ్లాక్ పరిధిలో 117 ఎకరాలు ముంపు బారిన పడడంతో పాటు 260 కుటుంబాలు నిర్వాసితులుగా మారతారని ఒడిశా ప్రభుత్వం వాదన. ఈ సమస్యను పరిష్కరించాల్సిన వైసీపీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఈ ఐదేళ్లలో జగన్ ఒకేఒక్కసారి ఒడిశా వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్‌ను కలిశారు. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలపై చర్చించినట్టు ప్రచారం చేశారు. అయితే, జంఝావతి గూర్చి చర్చించారో? లేదో తెలియదు. ఒకవేళ చర్చిస్తే ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారో చెప్పాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

9 వేల ఎకరాలకే సాగునీరు..

కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం వద్ద నాగావళి నదిపై ఉన్న జంఝావతి ప్రాజెక్టు ద్వారా 24 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 9వేల ఎకరాలకే సాగునీరు అందిస్తున్నామని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులే చెబుతున్నారు. పూర్తిస్థాయిలో సాగునీటి కోసం రైతులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నా నిరాశ తప్పడం లేదు. ఒడిశాతో ఉన్న వివాదాన్ని పరిష్కరించి రబ్బర్ డ్యామ్‌ను క్లోజ్ చేయించి ప్రాజెక్టు ద్వారా 24 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్న వైసీపీ ప్రభుత్వం మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయి.

రివర్స్ టెండర్ల పేరిట పనుల రద్దు..

టీడీపీ ప్రభుత్వ హయాంలో హైలెవెల్ కెనాల్ పనులతో పాటు మిగిలిన పనులు పూర్తి చేసి ఒడిశాతో సంబంధం లేకుండా సాగునీరు అందించేందుకు అప్పట్లో సుమారు రూ.18 కోట్ల నిధులు మంజూరు చేశారు. అయితే, వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ నిధులను ఆపేసింది. రివర్స్ టెండరింగ్ పేరిట టెండరు పిలిచి పనులు ఖరారు చేసింది. కానీ పనులు మాత్రం ముందుకు సాగలేదు. ప్రాజెక్ట్ పనులు చాలావరకూ పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే చేసిన నిర్మాణాలు వృథాగా వదిలేయడంతో పాడవుతున్నాయి. స్పిల్‌వే రెగ్యులేటర్ తుప్పు పడు తోంది. దీని బ్యాలెన్స్ పనులు పూర్తిచేయాల్సిన అవసరముంది. ప్రధానంగా 'రివర్ గ్యాప్' పనులు పూర్తయితే కానీ జలాశయానికి ఒక రూపురాని పరిస్థితి. ప్రధాన మట్టికట్టు వద్ద జలాశయం నుంచి ఎగువ, దిగువ ప్రధాన కాలువల అనుసంధాన పనులు పూర్తిచేయాలి. ఎగువ కాలువ పరిధిలో పార్వతీపురం మండలం చినబొండపల్లి నుంచి సీతానగరం మండలం వరకూ పనులు పెండింగ్‌లో ఉన్నా యి. చాలాచోట్ల కాలువకు తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. కొన్నిచోట్ల కల్వర్టులు, సూపర్ పాసేజ్‌లు, అక్విడెక్టుల నిర్మా ణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే కురుపాం నియోజకవర్గంలోని కొమరాడ, గరుగుబిల్లి మండలాలతో పాటు పార్వతీపురం నియోజకవర్గంలోని పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల్లోని వ్యవసాయ భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుంది. కానీ, ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనులు పూర్తికాక సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు.

త్వరలోనే సమస్య పరిష్కారం..

జంఝావతి ద్వారా ప్రస్తుతం 9 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం. ఒడిశాతో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇరు రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఇప్పటికే సమావేశమయ్యారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం కానుంది.

-అప్పలనాయుడు, ఇన్‌చార్జి ఈఈ, జంఝావతి ప్రాజెక్టు



పార్వతీపురం మండలం చినబొండపల్లి వద్ద రూపుకోల్పోయిన హై లెవెల్ కెనల్



కోటలోని మ్యూజియంలో వెంకయ్యనాయుడు భార్య ఉష

బొబ్బిలి కోటకు వెంకయ్య సతీమణి

- చారిత్రక స్థలాలను సందర్శించిన మాజీ ఉప రాష్ట్రపతి భార్య

బొబ్బిలి, ఫిబ్రవరి 18: భారత మాజీ ఉపరాష్ట్రపతి డాక్టర్ వెంకయ్యనాయుడు సతీమణి ఉష బొబ్బిలి పట్టణంలోని చారిత్రక కట్టడాలను ఆదివారం సందర్శించారు. తొలుత స్థానిక కోటలోని మ్యూజియం, రాజావారి గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. మ్యూజియంలోని రాజుల స్వర్ణ, వెండి సింహాసనాలు, అలనాటి పల్లకీ, బొబ్బిలి యుద్ధంలో వినియోగించిన ఆయుధాలను ఆసక్తిగా తిలకించారు. బొబ్బిలి-విజయ నగరం రాజుల మధ్య ఎందుకు యుద్ధం జరిగింది.. అందుకు దారితీసిన పరిస్థితులు, బొబ్బిలి రాజుల చరిత్ర, యుద్ధంలో తాండ్రపాపారాయుని పాత్ర తదితర అంశాలన్నింటినీ రాజవంశీయుడైన ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) ఆమెకు వివరించారు. బొబ్బిలియుద్ధంపై గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల్లో బుర్రకథల ప్రదర్శనలు విరివిగా జరిగేవని, సినిమాల ద్వారా ప్రపంచ స్థాయిలో మంచి ప్రాచుర్యం లభించిందని చెప్పారు. రాణిమల్లమ్మదేవి నాయకత్వంలో ఆనాటి మహిళలు ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు సునాయా సంగా ప్రాణత్యాగం చేసి చాటుకున్న తెగువను ఉషావెంకయ్యనాయుడు విని ఆశ్చర్యపోయారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో తమ పూర్వీకులు పోషించిన పాత్రను బేబీనాయన వివరించారు. ఆఖరి పట్టాభిషిక్తులైన రాజా ఆర్‌వీఎస్‌కేకే రంగారావు తమ తాతగారని, ఆయన మద్రాసు ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రిగా పనిచేసి ఈ ప్రాంతంలో పలు ఇరిగేషన్, పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో విశేషమైన కృషి చేసినట్లు వివరించారు. తమ తండ్రి ఆర్‌వీజీకే రంగారావు 1962లో పార్లమెంట్ సభ్యునిగా, సోదరుడు సుజయ్‌కృష్ణరంగారావు రాష్ట్రమంత్రిగా పనిచేశారని బేబీనాయన ఆమెకు తెలిపారు.

రైలు ఎప్పుడొస్తుందో?



ట్రయల్ రన్ వేస్తున్న రైలు (ఫైల్)

- విశాఖ-విజయనగరం పాసింజర్‌ను సాలూరు వరకు పొడిగిస్తూ రైల్వే శాఖ ఆదేశాలు
- ఐదేళ్లవుతున్నా అమలు కాని వైనం
- రైలు బస్సు కూడా ఆగిపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు

సాలూరు రూరల్, ఫిబ్రవరి 18: విశాఖ-విజయనగరం ప్యాసింజర్ రైలు(07468/07469)ను సాలూరు వరకు పొడిగిస్తూ ఈస్ట్‌కోస్టు రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ 2019 జనవరి 2న ఆదేశాలు జారీ చేశారు. అయితే, ఐదేళ్లవుతున్నా ఆ ఆదేశాలు అమలు కాలేదు. దీంతో ఆ రైలు సాలూరు ముఖం చూడలేదు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో పొడిగించిన బ్రహ్మపుర తదితర రైళ్ల మాత్రం అదే ఏడాది మార్చి నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. కానీ, సాలూరు విషయంలో రైల్వే శాఖ నిర్లక్ష్యం చేయడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు. 2020లో కరోనా దెబ్బకు సాలూరు-బొబ్బిలి మధ్య నడుస్తున్న రైలు బస్సును రైల్వే శాఖ ఆపేసింది. తరువాత కరోనా తగ్గినా ఈ రైలు బస్సును మాత్రం నడపడం లేదు. ఒకపక్క రైలు బస్సు లేక, మరోపక్క విశాఖ-విజయనగరం ప్యాసింజర్ రైలు రాక సాలూరు వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

సాలూరు రైల్వే స్టేషన్‌ను రెండోప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటీష్ పాలకులు నిర్మించారు. ఒడిశాకు సరుకు రవాణాకు ప్రధానంగా ఈ స్టేషన్‌ను వినియోగించారు. సాలూరు-బొబ్బిలి మధ్య తొలుత బొగ్గుతో నడిచే రైలు, తదుపరి డీజిల్ ఇంజిన్‌తో ట్రైన్ నడిచేది. నష్టాలు వస్తున్నాయని 1998లో ఈ స్టేషన్‌ను ఎత్తివేశారు. అయితే, ప్రయాణికుల దృష్ట్యా రైలు బస్సును నడిపారు. ఇది బొబ్బిలి-సాలూరు మధ్య ఐదు ట్రిప్పులు నడిచేది. దండిగాం రోడ్డులో స్టేజ్ ఏర్పాటు చేశారు. ఈ రైలు బస్సు సైతం కరోనా కాలం నుంచి నడవడం లేదు. సాలూరుకు రైలు నడపాలని స్థానిక నేతలు, వినియోగదారులు సంఘం కొన్నేళ్లుగా రైల్వే ఉన్నతాధికారులకు వినతులు ఇస్తూనే ఉన్నారు. దీంతో విశాఖ-విజయనగరం ప్యాసింజర్ రైలును సాలూరు వరకు రైలు పొడిగించడానికి రైల్వేశాఖ నిర్ణయించింది. దీనిలో భాగంలో సాలూరు-బొబ్బిలి రైల్వే మార్గాన్ని విద్యుదీకరించింది. డీఆర్‌ఎం ఆధ్వర్యంలో ట్రయల్ రన్ సైతం వేశారు. ఈ నేపథ్యంలో సాలూరుకు రైలు నడపడానికి ఈస్ట్‌కోస్టు రైల్వే ఆదేశాలు జారీ చేసింది. అయితే తదుపరి చర్యలు తీసుకోకపోవడంతో రైలు రాలేదు. వాస్తవానికి సాలూరుకు పొడిగించడం వల్ల రైల్వేకే ప్రయోజనముంది. విశాఖలో ప్రతి రోజూ సాయంత్రం 6.05 గంటలకు రైలు బయలుదేరుతుంది. రాత్రి 7.25 గంటలకు విజయనగరం స్టేషన్‌కు చేరుతుంది. అప్పటి నుంచి మరుసటిరోజు ఉదయం 6.15 గంటల వరకు అదే స్టేషన్‌లోనే ఉంటుంది. అంటే సుమారు 11 గంటల పాటు విజయనగరంలోనే ఉండిపోతుంది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్లాట్‌ఫారం సమస్య సైతం ఏర్పడింది. రాత్రి సమయంలో ఈ రైలు వల్ల ఇతర రైళ్ల రాకపోకలకు సిగ్నల్ ఇవ్వడానికి సమస్య ఎదురవుతుంటుంది. ఈ నేపథ్యంలో ఏ రద్దీ లేని సాలూరు స్టేషన్‌లో ఉంచడమే ఉత్తమంగా ఈకో రైల్వే భావించింది. దీంతో సాలూరు వరకు విశాఖ-విజయనగరం ప్యాసింజర్ రైలును పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కానీ అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి పొడిగించిన రైలుతో పాటు రైలు బస్సు నడపాలని సాలూరు ప్రాంతీయులు కోరుతున్నారు.



సాలూరుకు రైలు పొడిగిస్తూ జారీచేసిన ఉత్తర్వు కాపీ (ఫైల్)



సాలూరు రైల్వే స్టేషన్



ఇసుకగూడలో ఎండిపోయిన వరి చేనులో పశువులను వదిలేసిన దృశ్యం (ఫైల్)

- నెలల తరబడి ఆ ఊసే లేని వైనం
- వర్షాలకు పంట పాడైపోయినా అందని బీమా
- అప్పుల ఊబిలో రైతన్నలు

ఎండమావిలా నష్టపరిహారం

(భామిని)

ఖరీఫ్‌లో వరి సాగు చేసి నష్టపోయిన రైతాంగానికి పరిహారం ఎండమావిగానే మిగిలింది. సాగు చేసిన పంటలు దెబ్బతింటే ప్రభుత్వమే పరిహారం చెల్లిస్తుందని అధికారులు చెప్పినా క్షేత్రస్థాయిలో ఆ ఊసే లేకపోవడం శోచనీయమని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో వర్షాభావంతో పొట్ట దశలోనే నీరందక వరి పంటకు నష్టం వాటిల్లింది. వరి సాగు కోసం రైతులు విత్తనాల కొనుగోలు, దమ్ములు, ఎరువులు, పురుగు మందులు, కలుపుతీత కోసం భారీగా పెట్టుబడి పెట్టారు. వరుణ దేవుడు కరుణించక పోవడంతో ఎకరాకు రూ.25 వేల వరకు మదుపు పెట్టి అప్పుల ఊబిలో కూరుకుపోయాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టపరిహారం ఇవ్వాలని గత నాలుగు నెలలుగా అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని వాపోతున్నారు. తమ ఆశలు అడియాశలుగా మిగిలాయని చెబుతున్నారు. మండలంలో మైదాన ప్రాంత గిరిజన రైతులు అధికంగా నష్టాన్ని చవిచూశారు. మండలంలో సుమారు 8 వేల ఎకరాల వరి సాగు చేయగా పోలవరం, పాలీష్‌కోట నుంచి మనుమకొండ, పాలవలస, తివ్వకొండ దిగువ ప్రాంతాల్లో వేలాది ఎకరాలు పొట్ట దశలోనే నీరందక నష్టం వాటిల్లింది. ఇసుకగూడ, మూలగూడ, సవరపాడు, బొడ్డగూడ, మణిగ, బురుజోల తదితర గ్రామాల్లో పొలాల్లో పశువులను వదిలేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.


పొట్ట దశలోనే పశువుల మేత..



సెప్టెంబరు నెల నుంచి వర్షాలు కురవకపోవడంతో పంటలు దెబ్బతిన్నాయి. పొట్ట దశలోనే నీరందలేదు. ఎకరాకు సుమారు రూ.5వేల వరకు నష్టం వాటిల్లింది. పంటల బీమాను అందించాలి.

-బిడ్డిక ప్రభాకర్, రైతు, బొడ్డగూడ

ప్రభుత్వమే ఆదుకోవాలి..



పంట నమోదు చేయాలని ఫొటోలు, ఈకేవీసీ చేయించినా నష్టపోయిన పంటకు పరిహారం అందలేదు. ఈ ఏడాది కుటుంబానికి తిండి గింజలు లేవు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

-ఎన్.ఆదినారాయణ, రైతు, పాలీష్‌కోట

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

వర్షాభావ పరిస్థితుల్లో తివ్వకొండ ప్రాంతంలో 600 ఎకరాల వరికి నష్టం ఏర్పడినట్టు క్షేత్రస్థాయిలో గుర్తించి నమోదు చేశాం. ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందించాం. పరిహారం డబ్బులు వచ్చిన వెంటనే అందిస్తాం.

-మన్మథరావు, వ్యవసాయాధికారి

వేంకటేశ్వరుని కల్యాణానికి వేళాయె

- రేపు తోటపల్లి దేవస్థానంలో మహోత్సవం
- ముమ్మర ఏర్పాట్లు



ముస్తాబైన తోటపల్లి దేవస్థానం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 18: ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వరుని ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మాఘశుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం 5 గంటలకు స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్న ట్లు చెప్పారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయన్నారు. 24న పవిత్ర నాగావళి నదిలో స్వామివారికి శ్రీచూర్ణోత్సవం, శ్రీచక్ర తీర్థ స్నానం భక్తుల నడుమ నిర్వహిస్తామన్నారు. వీరఘట్టానికి చెందిన ప్రముఖ యజ్ఞ యాగకర్త బ్రహ్మశ్రీ ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సంపూర్ణ పర్యవేక్షణలో పాణిగ్రహణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు, ఆగమ శాస్త్ర పండితులు సర్తె నరసింహచార్యులుతో పూజలు ఉంటాయన్నారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనే భక్తులు ముందుగా రూ.500 చెల్లించి రశీదు పొందాలన్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

ముమ్మరంగా వరి నాట్లు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 18: మండలంలోని రావుపల్లి, కొత్తపల్లి, కొత్తూరు, శివ్వాం, చిలకాం, కారివలస, దత్తివలస, నాగూరు, తదితర గ్రామాల్లో రబీ సీజన్‌కు సంబంధించి అన్నదాతలు ముమ్మరంగా వరి ఉబాలు చేపడుతున్నారు. తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువతో పాటు పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి కాలువల ద్వారా ఇరిగేషన్ అధికారులు సాగునీరు విడుదల చేయడంతో రైతులు దమ్ములు చేపట్టి నాట్లు వేస్తున్నారు. మరికొందరు రైతులు విద్యుత్ బోర్ల సహాయంతో ఉడుపులు చేస్తున్నారు.



నాట్లు వేసిన దృశ్యం

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు


పార్టీలో చేరిన వారితో అదితి గజపతిరాజు, టీడీపీ నాయకులు

● పార్టీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు

విజయగనరం రూరల్, ఫిబ్రవరి 18: రాష్ట్ర భవిష్యత్తు టీడీపీ విజయం పైనే ఆధారపడి ఉందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కష్టించి పనిచేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. నగరంలోని 27 డివిజన్‌కు చెందిన కె కనకరాజు తమ బంధువులు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీలో చేరారు. పార్టీలోకి వచ్చిన వారికి అదితి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అదితి మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లిందన్నారు. తిరోగమనంలో వున్న ఆంధ్రప్రదేశ్‌ను గాడిలో పెట్టాలంటే, మళ్లీ చంద్రబాబే ముఖ్యమంత్రిగా రావాల్సి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులు శ్రమించాల్సి ఉందని, తద్వారా పార్టీని విజయతీరాలకు చేర్చాలన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, అల్తి బంగారు బాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, షైలిపిల్లి పైడిరాజు, కండువా ప్రకాష్, గదుల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ● టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు విజయనగరంలోని 43వ డివిజన్ పరిధిలోని పాల్‌నగర్, మండల పరిధిలోని చిల్లపేటలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు బూర్లె విజయభాస్కర్, కర్రోతు సన్యాసిరావు, కృపా లక్ష్మణరావుతో పాటు, నగర, మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 18: 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటర్లలో చైతన్యం నింపాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు తెలుగుయువత నాయకులకు పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన తెలుగుయువత సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువతకు, నిరుద్యోగులకు టీడీపీ హయాంలో జరిగిన ప్రయోజనాలను వివరించాలన్నారు. అదే విధంగా రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి, అధికారం చేపట్టే క్రమంలో యువతకు భారీ అవకాశాలు ఇవ్వనున్నట్టు విస్తృతంగా వివరించాలన్నారు. తెలుగుయువత నాయకులు పొగిరి పైడిరాజు, జి సురేంద్ర, గంటా రవి, మాతా బుజ్జితో పాటు, పలువురు యువత నాయకులు పాల్గొన్నారు.

గుంకలాం సెంటు భూమిలోనూ అవినీతి ఉంది..

విజయనగరం రూరల్: నిరుపేదలకు ఇచ్చిన గుంకలాం సెంటు స్థలంతో కూడా ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆయన అనుచరులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని, ఈ విధంగా కోట్లాది రూపాయలు ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టారని టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, బొద్దల నర్సింగరావు ఆరోపించారు. ఆదివారం ఉదయం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, టీడీపీ ఎమ్మెల్యే కోలగట్ల చేసిన విమర్శలను ఖండించారు. రైతుల వద్ద నుంచి తక్కువకు కొనుగోలు చేసి, ఎక్కువ మొత్తానికి ప్రభుత్వానికి విక్రయించలేదా? దీనిపై కోలగట్ల వీరభద్రస్వామి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విజయనగరంలో గంజాయి మూలాలు గురించి మాట్లాడితే, ఎమ్మెల్యే కోలగట్ల ఎందుకు ఉలికి పడుతున్నారని ప్రశ్నించారు. గంజాయి వ్యాపారంతో సంబంధం ఎవరికి ఉన్నా, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. విజయనగరం నియోజకవర్గ అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో? తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. నగరంలోని ప్రధాన రోడ్ల విస్తరణ, నగర సుందరీకరణ, నగరంలోని ప్రధాన కూడళ్ల అభివృద్ధి అనే ప్రతిపాదనలు, నిధులు గత ప్రభుత్వ హయాంలో.. గత మున్సిపల్ పాలకవర్గం ఆమోదించినవేనన్నారు. వాటినే.. అటూ.. ఇటూ మార్చి.. సమయం తీసుకుని ఆయా పనులు చేపట్టారన్నారు. ఐదేళ్ల పదవీ కాలంలో ఎమ్మెల్యేగా విజయనగరం నగరపాలక సంస్థకు ప్రత్యేకంగా నిధులు ఏమైనా తీసుకువచ్చారా? వాటితో అభివృద్ధి పనులు చేపట్టారా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాలదీ కీలకపాత్రని, ప్రజా సమస్యలు, అభివృద్ధి గురించి అధికార పక్షాన్ని ప్రశ్నించడం బాధ్యతన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు అల్తి బంగారుబాబు, గంటా పోలినాయుడు, కంది మురళీనాయుడు, గొల్లకోటి శివ, ఏప రాజు, మస్తాన్‌వలీతో పాటు జనసేన నాయకులు పాల్గొన్నారు.

సింహాచలంలో అదితి ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వరాహలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో కలిసి టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా విశాఖ జిల్లాలో పర్యటిస్తున్న లోకేష్, సింహాచలేశుని దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందించారు.

కార్యకర్తలకు ధన్యవాదాలు: కోళ్ల

శృంగవరపుకోట: నియోజకవర్గపరిధిలోని లక్కవరపుకోట మండలం సోంపురం కూడలిలో శనివారం జరిగిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సభ విజయవంతమైందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం శృంగవరపుకోటలో విలేఖర్లతో మాట్లాడారు. సభను విజయవంతం చేసిన నాయకులకు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి హామీలు ఇచ్చిన లోకేష్‌కు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జీ.ఎస్.నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి మోహన్ రాజు, ఉపాధ్యక్షుడు గొర్రిపాటి రోహిణి కుమార్, కాళిదాసు తదితరులున్నారు.

ఎస్టీ గిరిజనులను మోసం చేసిన ప్రభుత్వం..

బాడంగి: 2019 ఎన్నికల్లో ఎస్టీ గిరిజనులకు అనేక రకాల బూటకపు హామీలను ఇచ్చి గద్దెనెక్కిన ఈ జగన్మోహన్‌రెడ్డి ఇంతవరకు ఒక్క హామీని కూడా అమలు చేయలేదని తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు అన్నారు. ఆదివారం ఎరుకులపాకలు గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఈ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాతే ఎస్టీ ఎరుకుల, గిరిజన కులాల చేతివృత్తులు పోయాయన్నారు. ఈ ప్రభుత్వం నవరత్నాల పేరుతో స్కీములను రద్దుచేసి కార్పోరేషన్లను రద్దుచేసి మా లాంటి బడుగు, బలహీన వర్గాల వారిని మోసం చేసిందన్నారు. కులవృత్తి మా జీవనాధార మని, మా లాంటి వారికి వృత్తిపరంగా సొసైటీలను రద్దుచేసి ఉపాధి కల్పించకుండా మోసం చేసిందన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. ఈ ప్రభుత్వాన్ని గద్దెదించేంతవరకు ప్రతి టీడీపీ కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేస్తే మన బడుగు, బలహీన వర్గాల వారికి తోడుగా ఉంటూ మన కులవృత్తులపరంగా అన్ని వర్గాల వారిని ఆదుకుంటారన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు


సింహాచలం ఆలయంలో నారా లోకేష్, అదితి గజపతిరాజు పూజలు


ఎస్.కోటలో మాట్లాడుతున్న కోళ్ల లలిత కుమారి


మాట్లాడుతున్న టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు

కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా రమాదేవి

విజయనగరం రింగురోడ్డు: కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కొణతాల రమాదేవిని నియమిస్తూ, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నికైన రమాదేవిని డీసీసీ అధ్యక్షుడు ఎస్.రమేష్‌కుమార్, నగర అధ్యక్షుడు సుంకరి సతీష్‌కుమార్ తదితరులు అభినందించారు.

25న గ్రూప్-2 ప్రిలిమ్స్‌కు ఆన్‌లైన్ పరీక్ష

విజయనగరం దాసన్నపేట: నగరంలోని ఆర్ఎస్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నెల 25న జరగబోయే గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షకు ఉచితంగా పేద విద్యార్థులకు ఆన్‌లైన్‌లో గ్రాండ్ టెస్ట్‌లతో పాటు చాప్టర్ టెస్టులు నిర్వహిస్తున్నట్టు అకాడమీ డైరెక్టర్ కరణం రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని వినియోగించుకోవడానికి విద్యార్థులు గూగుల్ ప్లే స్టోర్‌లో ఆర్ఎస్ రెడ్డి ఇనిస్టిట్యూట్ అనే యాప్‌ను మీ మొబైల్, ల్యాప్‌టాప్‌లో డౌన్‌లోడ్ చేసుకుని అందుబాటులో మీకు నచ్చిన సమయంలో రాయవచ్చునని తెలిపారు.

ఉత్తరాంధ్ర స్థాయి కట్ సీను పోటీలు

రాజాం: పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా ఉత్తరాంధ్ర స్థాయి పౌరాణిక, జానపద, సాంఘిక కట్ సీనుల పోటీలు మార్చి 17వ తేదీన నిర్వహించనున్నారని సలాది వెంకటరమణ కళాపరిషత్ అధ్యక్ష కార్యదర్శులు సలాది తులసీదాస్, అర్నిపల్లి వెంకటనాయుడు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాల్సిన వారు ఈనెల 28లోపు తమ ఎంట్రీలు పంపించాలని కోరారు. అయితే ఈపోటీలో పాల్గొనే వారికి ఎటువంటి ఎంట్రీ ఫీజులు లేవని ప్రథమ బహుమతి రూ. 5వేలు, రెండో బహుమతి రూ. 4వేలు, మూడో బహుమతి రూ. 3 వేలు అందజేస్తారన్నారు.

సీఎంకు ప్రచార పిచ్చి

బొబ్బిలి: సీఎం జగన్‌కు ప్రచార యావ పెరిగిపోయిందని కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వేల కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించి 'సిద్ధం' పేరుతో ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు పెట్టడాన్ని ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. పాడైన రోడ్లకు, తాగునీటి ఎద్దడికి, రైతులకు సాగునీరందించడానికి , ఉద్యోగుల బకాయిలను, విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు, చిరుద్యోగుల జీతాల పెంపు వంటివి చెల్లించడానికి నిధులు లేవని చేతులెత్తేసిన సీఎం తన సొంత ప్రచారానికి మాత్రం విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేయడం చాలా అన్యాయమన్నారు.

వాహన తనిఖీలు

రామభద్రపురం: మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపట్టారు. ఏ ఎస్‌ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో కార్లు, వ్యాన్ లు తనిఖీలు చేశారు. ఇటీవల కాలంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రవాణా జరుగుతుందనే సమాచారం అందడంతో ఈ వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. హెచ్‌సీలు, పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రచార వాహనాన్ని అడ్డుకోవాలి

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో నిర్వహిస్తున్న పలు ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియను అధికార యంత్రాంగం అడ్డుకోవాలని జిల్లా ఏఐఎస్ఎఫ్ సహాయకార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

ఉచిత నేత్రవైద్యశిబిరం

బొబ్బిలి: స్థానిక అభ్యుదయ హైస్కూలులో అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచితనేత్ర వైద్యశిబిరానికి స్పందన లభించింది. వంద మంది రోగులు వచ్చి పరీక్షలు జరిపించుకున్నారు. వారిలో 45 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించి శంకర్‌ఫౌండేషన్‌కు ఉచితంగా బస్సులలో వారిని తరలించే ఏర్పాట్లు చేశారు. ఆపరేషన్ తరువాత వైద్య సేవలు కూడా బొబ్బిలిలోనే నిర్వహించే ఏర్పాట్లు చేసినట్లు సంస్థ యజమాని ఎంకె నాయుడు (నాని), డాక్టర్ చింతా శారద తెలిపారు.

శివాలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

రాజాం: మండలం గురవాం గ్రామంలో ఉమారామలింగేశ్వర దేవాలయం 19వ వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు అర్చకులు జాత సంతోష్‌కుమార్ శర్మ స్వామివారికి అభిషేకాలు. కుంకుమ పూజలు కళ్యాణం నిర్వ హించారు. ఈ కల్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

చంద్రబాబు వస్తేనే ఉద్యోగులకు న్యాయం


వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజాం, ఫిబ్రవరి 18: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన కొత్త పెన్షన్ విధానంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎటువంటి మేలు కలగక పోగా తీవ్ర అన్యాయం జరుగుతుందని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాజాం మండల శాఖ అధ్యక్షుడు మువ్వల రమేష్ ఉద్యోగ సంఘాల నాయకులు ఆదివారం పొగిరి గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సమల వెంకట మన్మథరావును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మన్మథరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే ఉద్యోగులను అన్ని విధాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. జగన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో గట్టిగా ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు. చంద్రబాబునాయుడు వస్తేనే రాష్ట్ర ప్రజలకు, ఉద్యోగులకు స్వర్ణయుగం వస్తుందన్నారు. ఓపీఎస్ విధానంపై చంద్ర బాబునాయుడు కట్టుబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బలివాడ నాగేశ్వరరావు, వై భాస్కరరావు తదితరులు ఉన్నారు.

బీజేపీ విజయానికి పనిచేయాలి


కార్యవర్గ సమావేశం దృశ్యం

వేపాడ: రానున్న పార్లమెంట్, శాసన సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. వల్లంపూడిలో మండల పార్టీ అధ్యక్షుడు గోకాడ మహేష్ అధ్యక్షతన మండల నాయకులు, సమఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడపాటి మాట్లాడుతూ దేశంలో ప్రధాని మంత్రి మోదీ సారథ్యంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా ఎన్నికలకు వెళ్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరంగం దానేష్, మహిళా అధ్యక్షురాలు గుమ్మడి సుజాత, కిశాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కోన సతీష్, ఎస్.కోట కన్వీనర్ యలమంచిలి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ


బహుమతి అందుకుంటున్న శ్యాం

వంగర, ఫిబ్రవరి 18: మండలంలోని అరసాడ జడ్పీ పాఠశాలకు చెందిన 10 వతరగతి విద్యార్థి పి.శ్యాం ఈఈ ఎంటీ (ఎడ్యుకేషన్ ఎఫీపని మెరిట్ టెస్టు) పరీక్షలో ప్రతిభ కనపరిచాడు. ఇందుకుగాను విజయవాడలోని మాకి నేని బసవపున్నయ్య విజ్ఞానక్షేత్రంలో శనివారం సన్మానించి రూ. 8 వేలు నగదుతో పాటు ప్రశంసా పత్రాన్ని రాష్ట్రస్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్ చేతులమీదుగా అందుకున్నాడు. రాజాం నియోజకవర్గంలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి అరుదైన గౌరవం దక్కింది. శ్రీకాకుళం గురజాడ కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టాలెంటు టెస్టులో అరసాడకు చెంది న పదోతరగతి విద్యార్థి నవిరి దినేష్ టాప్ 10లో నిలిచి రూ.1000 నగ దు బహుమతి గెలుచుకున్నారు. ఇంత ప్రతిభ కలిగిన అరసాడకు చెందిన వారు కావటంతో ప్రధానోపాధ్యాయురాలు జగదీశ్వరి, అప్పలరాజు, ఠాగూర్ ఇత ర సిబ్బంది తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ధర్నాను విజయవంతం చేయాలి

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 18: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమానికి నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న అన్ని రకాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంస్థ, రాష్ట్ర కమిటీ సభ్యులు జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం మస్టర్ పాయింట్లలో గాజులరేగ, హుకుంపేట, కొత్తపేట, జొన్నగుడ్డి కార్మికులకు కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల సమ్మె కాలపు జీతం, సంక్రాంతి కానుక వెయ్యి రూపాయలు, రెండు నెలల హెల్త్ అలెవెన్సు, మూడు ఏళ్ల సరెండర్ లీవు డబ్బులు, బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రామారావు, ఆదినారాయణ, రమణ, కృష్ణ, బాబురావు, శివ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాల ప్రచార సభలో మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు


తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 18: మైనర్లకు వాహనాలు ఇస్తే, తనిఖీల్లో పట్టుబడితే, కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ కె రామారావు హెచ్చరించారు. టూటౌన్ సీఐ ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్, రాజేష్ వాహన తనిఖీలు చేపట్టగా, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండోసారి పట్టుబడితే, వాహనాలు సీజ్ చేసి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు,. లైసెన్సు పొందిన తరువాతే.. పిల్లలకు వాహనాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన సూర్యనారాయణ


లోకేశ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న సూర్యనారాయణ, బంగారరాజు

విజయనగరం, ఫిబ్రవరి 18: విశాఖ జిల్లాలో శంఖారావం యాత్రను నిర్వహిస్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను వెంపటాపు సూర్యనారాయణ కలిశారు. ఆదివారం లోకేశ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగారు రాజు, ఇజ్జిరోతు వెంకటరమణ నియోజకవర్గ సమస్యలను లోకేశ్‌కు వివరించారు. వీరితో పాటు నియోజవర్గానికి చెందిన కొంత మంది కార్యకర్తలు, నాయకులు కూడా పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ జెఏసీ చైర్మన్

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 18: రాష్ట్ర ప్రభుత్వం ఉ ద్యోగుల సమస్యలు పరిష్కరించేంత వరకూ నిర సన కొనసాగిస్తామని ఏపీ జేఏసీ చైర్మన్ జీవీ ఆర్ఎస్ కిషోర్, ఉపాధ్య క్షులు డీవీ రమణ హెచ్చ రించారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వా రు మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని జెఏసీ భాగస్వామ్య పక్షాల సంఘ నాయ కులు పాల్గొని 20న జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకూ పెద్ద ఎత్తున ర్యా లీ, ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి అన్ని శాఖల ఉద్యో గులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సంఘాల ప్రతినిధులు ఆనంద్‌కుమార్, శ్రీనివాసరావు, శ్రీధర్‌బాబు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి శ్రీక్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు


పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం రింగురో డ్డు, ఫిబ్రవరి 18: ప్రముఖ భారతీయ తత్త్వ దర్శన కేంద్రం శ్రీక్షేత్రంలో ఈ నెల 22 నుంచి 27 వరకూ అష్టమ వార్షిక బ్రహోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు అన్నారు. ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 23న ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ అనంతరం, సాయంత్రం 4 గంటలకు తిరువీధి, ఎదురుకోలు ఉత్సవం, 24న ఉదయం 9 గంటలకు 1008 తులసీమొక్కలతో బృందావన తులసీ వరార్చన, సాయంత్రం ఆరు గంటలకు స్వామి వారి కళ్యాణ మహోత్సవం, 25న ఐశ్వర్య శ్రీనివాసాఅవహనం, 26న ఉదయం తిరుప్పావై సేవ, సాయంత్రం గరుడోత్సవం, 27న మహాపూర్ణాహుతి, శ్రీచక్ర స్నానం, రాత్రి 8 గంటలకు ఏకాంత సేవలు వుంటాయని పేర్కొన్నారు. భక్తులంతా స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు. కార్యక్రమం చార్టెడ్ అకౌంటెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

జామి: భూ వివాదం నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రంబ ఎర్నివెంకటరమణకు అదే గ్రామానికి చెందిన కర్రి కృష్ణకు మధ్య గత కొంతకాలంగా భూ వివాదాలు ఉన్నాయి. అయితే ఈ క్రమంలో ఆదివారం ఉదయం వెంకటరమణ తన భూమిలో ఉన్న మినపచేనును తీస్తుండగా కర్రి కృష్ణ, అతని భార్య కర్రి కాంత రాయితో దాడిచేసి గాయపరిచారు. దీనిపై వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. బాధితుడు విజయనగరం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

తల్లీ కొడుకు అదృశ్యంపై కేసు

జామి: మండలంలోని తానవరం గ్రామానికి చెందిన తల్లీకొడుకు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు. ఆదివారం ఎస్‌ఐ మాట్లాడుతూ ఈనెల 9న గ్రామానికి చెందిన వివాహిత సిరికి భవానీ తన మూడు సంవత్సరాల కుమారుడు ప్రణీత్‌తో ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి నుంచి అదృశ్యం అయిందన్నారు. ఈ విషయంపై భవానీ భర్త సన్యాసినాయుడు ఫిర్యాదు చేశారని దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

రాజాం: సంతకవిటి మండలం గుళ్ల సీతారాంపురం గ్రామానికి చెందిన పేకల నారాయణరావు కిరాణా దుకాణంలో 46 మద్యం క్వర్టర్ సీసాలు అమ్ముతుండగా ఆదివారం పట్టుకున్నట్టు ఎస్‌ఐ షేక్ శంకరరావు తెలిపారు. మద్యం అక్రమంగా అమ్మకాలు చేస్తున్న విషయంపై సమాచారం అందడంతో సిబ్బంది దాడి చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామన్నారు.

స్వామి వివేకానంద జయంతి వేడుకలు

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో ఆదివారం స్వామి వివేకానంధ జయంతి వేడుకలను గ్రామ యువకుల సారధ్యంలో ఘనంగా నిర్వహించారు. వంటాకు శ్రీను, రావాడ వెంకటరావు, రావాడ రామసత్యం, రోంగలి సత్తిబాబు, గొర్లి అవతారం తదితరులు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ప్రారంభం..

● మునకలవలసలో వైసీపీ నేతల హడావిడి
● వినియోగంలో ఉన్న సచివాలయానికే ప్రారంభోత్సవం



మునకలవలసలో సచివాలయం భవనం ప్రారంభిస్తున్న జడ్పీచైర్మన్, ఇదే సచివాలయంలో ఆరునెలల క్రితం ప్రారంభోత్సవ పూజలు

రేగిడి: మండలంలో మునకలవలసలో వినియోగంలో ఉన్న సచివాలయాన్ని రెండోసారి ప్రారంభించి వైసీపీ నేతలు హడావిడి చేశారు. మండలంలో 25 సచివాలయాలు ఉండగా మునకలవలస సచివాలయ భవనానికి రూ. 43లక్షల కేటాయించారు. ఆరునెలల క్రితమే ఈభవనం నిర్మాణపనులు పూర్తియ్యాయి. ఇక్కడ పాత పంచాయితీ కార్యాలయంలో గతంలో సచివాలయం సిబ్బంది విధులు నిర్వహించగా సిబ్బందికి వసతి సమస్య తీవ్రంగా ఉండేది. ఇది గ్రహించిన గ్రామపెద్దలు నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని గత ఏడాది జూలై23న ప్రత్యేక పూజలు నిర్వహించి భవనం ప్రారంభించి సిబ్బందికి అప్పుజెప్పారు. గత ఎనిమిదినెలలుగా కొత్త సచివాలయలంలో సిబ్బంది విధులు నిర్వహిస్తు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఇలా సేవలందిస్తున్న సచివాలయానికి జెడ్‌పిచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్‌బాబు, వైకాపా రాజాం ఇన్‌చార్జ్ తలే రాజేష్‌ల చేతలమీదగా రెండోసారి ఆదివారం మళ్లి ప్రారంభించారు. దీనిపై యంత్రాంగం సైతం వినియోగంలో ఉన్న సచివాలయం మళ్లి ప్రారంభోత్సవ ఎంటి అని అడ్డుచెప్పకపోవటం విమర్శలకు దారితీసింది.

విజ్ఞాన యాత్రలో మారిక విద్యార్థులు


సముద్ర తీరప్రాంతంలో మారిక విద్యార్థులు

వేపాడ: మండలంలో గిరిశిఖర గ్రామంగా గుర్తింపు పొందిన మారిక పాఠశాల విద్యార్థులు విహార విజ్ఞాన యాత్రలో భాగంగా పలు ప్రదేశాలను సందర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎస్‌వీ శ్రీకాంత్, కే.రమేష్, విద్యార్థుల్లో విజ్ఞానం, మానసిక వికాసం కలిగించేందుకు భీమిలి, సముద్ర తీరానికి, విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు, బీచ్‌కు తదితర ప్రాంతాలకు విద్యార్థులను తీసుకువెళ్లారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్ మాట్లాడుతూ ఇటువంటి విహార యాత్రలు విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంచడంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. సందర్శనలో విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఏఎన్ఎంలపై పనిభారం తగ్గించాలి



మాట్లాడుతున్న ప్రసాద్

బెలగాం: గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలపై పనిభారం తగ్గించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎ.మాధవి, స్వామిప్రసాద్ కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆ యూనియన్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో పని చేస్తున్న ఏఎన్ఎంలకు వర్క్ ఫెర్ఫార్మెన్స్ టార్గెట్ పేరుతో ప్రభుత్వం ఒత్తిడికి గురి చేస్తుందని ఆరోపించారు. పనిచేయని పరికరాలు ఇచ్చి షుగర్, బీపీ, రక్త నమూ నా సేకరణలో నాణ్యమైన రిపోర్ట్‌లు అందించలేదని షోకాజ్ నోటీసులు ఇవ్వడం, సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామ సచివాల యంలో పనిచేస్తున్న సచివాలయ ఏఎన్ఎంలను ఎంపీహెచ్ఏ ఫిమేల్‌గా ప్రమో ట్ చేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని, సరైన శిక్షణ ఇవ్వాలని, జనాభా ప్రాతపదికన అదనపు సిబ్బందిని నియమించాలని, యూనిఫాం, అలెవెన్స్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యనమల మన్మథరావు, యూనియన్ నాయకులు డిల్లీశ్వరిరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థిని

జియ్యమ్మవలస: స్థానిక కేజీబీవీ నుంచి ఈనెల 14న అదృశ్యమైన తొమ్మిదో తరగతి విద్యార్థినిని చినమేరంగి పోలీసులు పట్టుకుని, తన తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. విద్యార్థిని అదృశ్యంపై ఈనెల 15న కేజీబీవీ ఎస్‌వో మరడాన శ్రీదేవి చినమేరంగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ చిన్నం నాయుడు సిబ్బందితో గాలింపు చేపట్టారు. శనివారం రాత్రి గరుగుబిల్లి మండలంలోని ఓ గ్రామంలో తన చిన్నాన్న వాళ్ల ఇంట్లో విద్యార్థిని ఉన్నట్లు గుర్తించారు. అక్కడ నుంచి విద్యార్థినిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆదివారం ఉదయం విద్యార్థినిని కేజీబీవీ ఎస్‌వో శ్రీదేవి సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. సోమవారం విద్యార్థినిని తీసుకురావాలని మండల మెజిస్ట్రేట్ ముందు ఉంచాల్సి ఉందని తల్లిదండ్రులకు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా, తనకు చదవుకోవడం ఇష్టం లేక, తల్లిదండ్రులకు ఈ విషయం చెప్పేందుకు భయపడి కేజీబీవీ నుంచి పారిపోయానని ఆ విద్యార్థిని ఎస్ఐ ముందు వాంగ్మూలం ఇచ్చింది.

857 లీటర్ల సారా ధ్వంసం



స్వాధీనం చేసుకున్న సారా క్యాన్లతో పోలీసులు

జియ్యమ్మవలస: కురుపాం మండల కేంద్రంలో పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో సారా ధ్వంసం చేయడంతో పాటు 4 ద్విచక్ర వాహనాలు వేలం వేశారు. ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలో కురుపాం, ఎల్విన్‌పేట, నీలకంఠాపురం పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన 22 సారా కేసుల్లో పట్టుబడిన 857.6 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. అలాగే కురుపాంలోని సారా కేసుల్లో పట్టుబడ్డ నాలుగు ద్విచక్ర వాహనాల వేలం పాట నిర్వహించి రూ.64,710 వసూలు చేశామని డీఎస్పీ కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ, ఎల్విన్‌పేట, కురుపాం, నీలకంఠాపురం ఎస్ఐలు బి.శివప్రసాద్, ఎస్.షణ్ముఖరావు, నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

గుమ్మలక్ష్మీపురం: ఐక్య పోరాటాల ద్వారానే న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి వీలుంటుందని సీపీఎం నాయకుడు మూడడ్ల కృష్ణమూర్తి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఆదివారం అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ పాలన సాగిస్తుందని మండిపడ్డారు. ఒక వైపు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ, మరోవైపు మతోన్మాద పార్టీగా పాలన సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, కోశాధికారి మండంగి రమణ, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కస్తూరి, సత్యవతి, సీఐటీయూ నాయకులు గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పు చారిత్రాత్మకం



మాట్లాడుతున్న వక్తలు

బెలగాం: సంపన్న కార్పొరేట్ కంపెనీల నుంచి పెద్దఎత్తున విరాళాలు సేకరించి ఎన్నికలను బీజేపీ తమకు అనుకూలంగా మార్చుకునేందుకే ఎన్నికల బాండ్ల విధానం తెచ్చిందని, ఆ విధానంపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష నాయకులు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, అధికారంలో ఉన్న పార్టీలకు సంపన్న కార్పొరేట్ కంపెనీలు అధిక మొత్తంలో ఉన్న విరాళాలు ఇస్తాయి, ఆ తర్వాత కార్పొరేట్‌లు అధికార పక్షాలు దోచిపెడుతున్నాయని ఆరోపించారు. అందుకే ఎన్నికల బాండ్ల విధానం క్విడ్ ప్రోకోకు దారి తీస్తుందని కోర్టు భావించదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రెడ్డి వేణు, మన్మథరావు, సూరిబాబు, సీపీఐ నాయకులు తోట జీవన, యువజన నాయకులు కె.రాజు, పి.రాజశేఖర్, భాస్కరరావు, రైతు సంఘం నాయకులు బంటు దాసు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.సంగం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తాం



మాట్లాడుతున్న మెట్ట రామారావు

సీతంపేట: వెనుకబడిన ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలంటే ప్రజా పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్ట రామారావు స్పష్టం చేశారు. ఆదివారం సీతంపేట విచ్చేసిన ఆయన స్థానిక బస్టాండ్ కూడలి వద్ద బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, ఉపాధి సంక్షేమమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. మూతపడిన సహకార రంగం జనపనార పరిశ్రమలు, కొబ్బరి, జీడి, అరటి, జామ, మామిడి తదితర వాణిజ్య పంటలు గిట్టుబాటు ధర కల్పిస్తూ ఫ్యాక్టరీలు తెరిపిస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో 53 ఎమ్మెల్యే, 8 ఎంపి స్థానాలకు తమ పార్టీ తరఫున అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూన రామారావు, ఉపాధ్యక్షుడు పీవీఏ ఆనంద్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద గచ్చలవలస ఉప కేంద్రంలో కొత్తగా స్తంభాలు వేస్తున్నందున సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకూ గచ్చలవలస, పీకే పాలవలస సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు పూడి హరి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

టీడీపీ విజయం తథ్యం

- గ్రామాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ
- సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం



పార్వతీపురం: సూపర్ సిక్స్ పథకాలపై వివరిస్తున్న విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయచంద్ర అన్నారు. జిల్లా కేంద్రం కొత్తవలసలో ఆదివారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరమన్నారు. సామాన్య మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడగానే నిత్యావసర సరుకులతో పాటు ఇతర ధరలను తగ్గిస్తూ ప్రజలు మేలు కలిగిస్తామన్నారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ కాలంలో పార్వతీపురం మున్సిపాలిటీ అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని చెప్పారు. బైపాస్ రహదారికి ఇరువైపులా విద్యుదీకరణ పనులు, ఫ్లైఓవర్ వంతెన పనులు టీడీపీ హయాంలోనే జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోనిదేవి చంద్రమౌళి, కౌన్సిలర్లు కోలా సరిత, కె.నారాయణరావు, జి.రవికుమార్, కోలా మధుసూదనరావు, గొట్టాపు వెంకట్‌నాయుడు, టి.వెంకటరమణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని కొత్తగూడ, యు.కొత్తగూడ, గొరంజన్‌గూడ, బూగన్నగూడ గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించారు. పార్టీ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండయ్య నాగేశ్వరరావు, గుడారి వెంకటరమణ, బిడ్డిక కడాయి, సుబ్బలక్ష్మి, మల్లేసు, బాలరాజు, వెంకటరమణ, గవరయ్య భాస్కరరావు, రమేష్ పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: కరపత్రాలు అందజేస్తున్న జగదీశ్వరి

ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జనసేన నాయకుడు బాబు పాలూరు

గరుగుబిల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాబు పాలూరు పిలుపునిచ్చారు. మండలంలోని రావుపల్లి, పెద్దూరు గ్రామాల్లో ఆదివారం జనసేన జెండాను ఆవిష్కరించారు. కురుపాం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. రెండు దఫాలు శాసనసభ్యులుగా పనిచేసిన పుష్పశ్రీవాణి నియోజకవర్గ అభివృద్ధికి కనీసం పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త కడ్రక మల్లేష్‌తో పాటు జన సైనికులు, టీడీపీ నాయకుడు జి.సింహాచలం పాల్గొన్నారు.

సీహెచ్‌డబ్ల్యూలను ఆశాలుగా మార్చాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన

పాచిపెంట: కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల (సీహెచ్‌డబ్ల్యూ)ను ఆశావర్కర్లుగా మార్చాలని ఆశావర్కర్ల యూనియన్ నాయకులు సీహెచ్ భవానీ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పీహెచ్‌సీ వద్ద సీహెచ్‌డబ్ల్యూలు సీఐటీయూ నాయకుడు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ సీహెచ్‌డబ్ల్యూలకు ఆశాలతో సమానంగా వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. యూనిఫాం, మెడికల్ కిట్లు, రికార్డులు మంజూరు చేయాలని, అలాగే పది లక్షల రూపాయలు గ్రూపు ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. తదితర డిమాండ్ల సాధనకు ఈనెల 19వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ నిరసనలో సీహెచ్‌డబ్ల్యూ నాయకులు ఎస్.శకుంతల పాల్గొన్నారు.



పాచిపెంటలో నిరసన చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

టేకు చెట్ల నరికివేత

- తరలిస్తుండగా పట్టుకున్న అటవీ అధికారులు
- నలుగురు పరారీ
- అధికారుల అదుపులో ఇద్దరు ట్రాక్టర్ డ్రైవర్లు

మెంటాడ: లింగాలవలస పంచాయతీ మూలపాడు గ్రామం సమీపంలోని ఆంధ్ర సెక్షన్ అటవీ ప్రాంతంలో ఆదివారం కొందరు వ్యక్తులు టేకు చెట్లను అక్రమంగా నరికి తరలించేందుకు సిద్ధమయ్యారు.. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు మెరుపు దాడి చేసి, టేకు చెట్లను, వాటిని తరలించేందుకు తీసుకొచ్చిన రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. అటవీ అధికారులు ఈ ప్రాంతంలో కొన్నాళ్లుగా నిఘా పెట్టారు. అక్రమ నరికివేతపై సమాచారం ఇవ్వాలని స్థానిక గిరిజనులకు సూచించారు. ఆదివారం దత్తిరాజేరు మండలానికి చెందిన ఆరుగురు వ్యక్తులు అటవీ ప్రాంతంలోని ఫారెస్ట్ ప్లాంటేషన్‌లో రెండు టేకు చెట్లను నరికి ముక్కలుగా కోసి ట్రాక్టర్లు లోడ్ చేస్తుండగా, గిరిజనుల ద్వారా సమాచారం అందుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కేవీఎస్ రాజు సిబ్బందితో కలిసి దాడి చేశారు. అటవీ శాఖ అధికారులను చూసిన ఆరుగురిలో నలుగురు టేకు దొంగలు పరారయ్యారు. మిగిలిన ఇద్దరు ట్రాక్టర్ డ్రైవర్లను ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమ రావాణాకు సిద్ధంగా ఉన్న టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. కేసు నమోదు చేస్తామని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ తెలిపారు. ఈ దాడిలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌లు బి.అప్పలరాజు, కేవీఎస్ రాజు, వై.కేశవ, పి.మధు, సిబ్బంది యు.సమత, రామారావు పాల్గొన్నారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న టేకు దుంగులు

చెత్త సేకరణ కేంద్రం ఏర్పాటు చేస్తే ఉద్యమం తప్పదు

గరుగుబిల్లి: మండలంలోని కొంకడివరంలో చెత్త సేకరణ కేంద్రం ఏర్పాటు చేస్తే ఉద్యమం తప్పదని కొంకడివరం గ్రామ సర్పంచ్ అల్లు అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే ప్రధాన రహదారికి అనుకుని ఉన్న కొంకడివరం, సీతారాంపురం గ్రామాల ప్రజలకు నిత్యం ఇబ్బందులు గురికావడంతో పాటు రోగాలబారిన పడే అవకాశం ఉందని తెలిపారు. రెండు గ్రామాలకు సమారు 200 మీటర్ల దూరంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు పార్వతీపురం మున్సిపల్ కమిషనర్, సిబ్బంది చర్యలు చేపట్టడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డుతో గ్రామ పరిసరాలు, భూగర్భ జలాలు, పంట భూములకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. అలాగే పాడి పశువులు, గొర్రెలు, మొక్కలతో పాటు పలు రకాల వాటికి రోగాలబారిన పడతాయన్నారు. ఈ సమస్యపై గతంలో కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణితో పాటు పలువురు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా నేటికీ ఎటువంటి స్పందన లేదన్నారు. అలాగే గతేడాది ఫిబ్రవరి 25న స్పందనలో కలెక్టర్‌తో పాటు పలు శాఖల అధికారులకు సమస్య తెలియపర్చామన్నారు. నేటికి ఏడాది కావస్తున్నా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు డంపింగ్ యార్డుపై నిరసన తెలుపుతున్నా పార్వతీపురం మున్సిపాలిటీ అధికారులు ఏర్పాటుకు పరిశీలన చేయడం విచారకరమన్నారు. గత కొన్నేళ్లుగా పార్వతీపురంలో ఉన్న డంపింగ్ యార్డును కొంకడివరం తరలించే చర్యలు మానుకోవాలని కోరారు. పార్వతీపురం మండలంలోని కృష్ణపల్లి, రావివలసలో గతంలో ప్రతిపాదించినా ఆ ప్రాంతంలో అడ్డుకున్నారన్నారు. ప్రస్తుతం కొంకడివరం వైపు దృష్టి సారిస్తున్నారని చెప్పారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే నిరసనలతో పాటు ఉద్యమాలు తప్పవన్నారు. ● కొంకడివరంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దు అంటూ సోమవారం కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే వచ్చే సమస్యలను కలెక్టర్‌కు వివరించనున్నట్లు తెలిపారు.



కొంకడివరం ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు పరిశీలన చేస్తున్న మున్సిపల్ అధికారులు (ఫైల్)

పోలమాంబకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం శ్రీశంబర పోలమాంబ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వనం గుడి వద్ద వేపచెట్టుకు మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. గోముఖి నదీ తీరాన అమ్మవారికి చీరలు చూపించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని చదురుగుడిలో భక్తులు పెద్దఎత్తున క్యూలైన్లలో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం నిర్వహించే 5వ వారం జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు.

ఘనంగా పరదేశమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న కేఏ నాయుడు, తదితరులు

గంట్యాడ: బురదపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన పరదేశమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గ్రామస్థులు మొక్కులు చెల్లించుకున్నారు. గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, పార్టీ నాయకులు రంధి చినరామునాయుడు, గ్రామ పెద్దలు పోలినాయుడు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి శత్రుచర్ల పరామర్శ



చిన్నంనాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి శత్రుచర్ల

జియ్యమ్మవలస: గెడ్డతిరువా డ గ్రామానికి చెందిన బడే చిన్నంనాయుడు ఇటీవల మృతి చెందినట్లు తెలుసుకున్న మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, అకు పార్లమెంటు అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, తూర్పు కాపు సాధికార అధ్యక్షులు లెంక గోపాలం, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తినాయుడు, దాసరి రామారావు, సొంటేన శ్రీరాములునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూలో శానిటేషన్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు

పాలకొండ: పాలకొండ ఏరియా ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ అండ్ సెక్యూరిటీ గార్డులు 30 మంది సీఐటీయూలో ఆదివారం చేరారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు మాట్లాడుతూ ఆసుపత్రి శానిటేషన్, సెక్యూరిటీగార్డుల సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏరియా ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ అండ్ సెక్యూరిటీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా కె.అప్పన్న, ఉపాధ్యక్షులు ఎన్.జయరాజు, పి.గున్నమ్మ, ప్రధాన కార్యదర్శి టి.జయనారాయణ, కార్యదర్శి ఎ.ప్రసాద్, డి.రవి, కోశాధికారి ఆర్.రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఎ.కృష్ణ, కె.నీలిమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కాద రాము పాల్గొన్నారు.

నిరుపయోగంగా బోర్లు

- పట్టించుకోని అధికారులు
- తాగునీటికి ఇబ్బంది పడుతున్న గజపతినగరం మండలవాసులు

గజపతినగరం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటుచేసిన బోర్లు నేడు నిరుపయోగంగా పడిఉన్నాయి. కొన్ని మరమ్మతులకు నోచుకోకపోవడంతో పాటు పలు గ్రామాల్లో వాటి ఉపయోగం లేక నిరుపయోగంగా ఉన్నాయి. అలాగే గతంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన బోర్లు వాడుక లేక వెలవెలబోతున్నాయి. పలు గ్రామాల్లో ప్రజలు ఇప్పటికీ తాగునీటికి ఇక్కట్లకు గురవుతన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న బోర్లను తొలగించి అవసరమైన చోట ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. నిరుపయోగంగా ఉన్న బోర్లు అలానే వదిలేస్తే శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు దొంగల పాలయ్యే ప్రమాదం లేకపోలేదని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. మండలంలోని జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ పైపులైన్లకు రూ.9కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే పలు గ్రామాల్లో పనులు చేపట్టినప్పటికీ పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా జరగడంలేదు. దీంతో అక్కడ ఉన్న బోర్లనే ఆశ్రయించాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వృథాగా పడిఉన్న బోర్లను వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.



పురిటిపెంట ఎస్సీ కాలనీలో వాడుకలేక వృథాగా ఉన్న బోరు



వేమలి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న బోరు

వినియోగంలోకి తీసుకు వస్తాం

శిథిలావస్థలో ఉన్న బోర్లను తొలగిస్తాం. మరమ్మతులకు నోచుకోని వాటిపై దృష్టి సారించి వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

- నానిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

క్లుప్తంగా..

ఘనంగా సుదర్శన హోమాలు



గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం ఘనంగా సుదర్శన హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభం

వీరఘట్టం: చిట్టిపుడివలస గ్రామం జంక్షన్‌లో శ్రీకాకుళం శ్రీసత్యసాయి నిత్య అన్నపూర్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ.70లక్షల అంచనా వ్యయంతో కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. గ్రామానికి చెందిన గుంట్రెడ్డి స్వామినాయుడు, వారి కుటుంబ సభ్యులు 30 సెంట్లు స్థలాన్ని సేవా సంఘానికి గతంలో అందించారు.

రామమందిరంలో దివ్యజీవన సత్సంగం

పాలకొండ: పట్టణంలోని నాగవంశపువీధిలోని రామ మందిరంలో దివ్యజీవన సత్సంగ సమావేశం ఆదివారం నిర్వహించారు. ప్రధాన వక్తగా సత్యసాయి ప్రతినిధి ఎన్వీ రమణ పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. రామాయణం, భగవద్గీతలోని ముఖ్య ఘట్టాలను వివరించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వక్తలు జగ్గారావు, యోగేశ్వరరావు, దర్శిత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: రామతీర్థం దేవస్థానంలో శివపార్వతుల వార్షిక కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి విఘ్నేశ్వర పూజ, పుణ్యావచనం చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను తిరువీధుల్లో ఊరేగించారు. శాస్త్రోక్తంగా స్వామివారికి కల్యాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈవో వై.శ్రీనివాసరావు, అర్చకస్వాములు, భక్తులు పాల్గొన్నారు. ఈ కల్యాణాన్ని రేజేటి మల్లికార్జున స్వామి జరిపించారు.

విలువలతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న శివకృష్ణ

చీపురుపల్లి: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని విద్యావేత్త బూరాడ శివకృష్ణ అన్నారు. ఆశయ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఆదివారం జరిగిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమంలో ఆయన మాట్లాడా రు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని ఆ దిశగా తమ ప్రయత్నాలను సాగించాలన్నారు. విద్యతో పాటు విలువలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశయ అధ్యక్షుడు రెడ్డి రమణ, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ హైమవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.